క్లుప్తంగా

భూముల రీ సర్వేతో మేలు



అల్లెనలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు

బూర్జ: భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ ఎస్.రమణారావు కోరారు. మండలంలోని అల్లెన, కిలంతర, జీబీ పురం గ్రామాల్లో సోమవారం ఆయన రైతులతో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వ్యవసాయ భూముల రీసర్వే సమయంలో పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, ఫొటో తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జడ్డు మహేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మండల కేంద్రానికి చేరిన బోర్‌వెల్ సామగ్రి



భద్రపర్చిన బోర్‌వెల్ సామగ్రి

ఆమదాలవలస రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా బోర్‌వెల్ సామగ్రిని మండల పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. తాగునీటి బోర్లు మొరాయిస్తే వాటికి మరమ్మతులు చేసేందుకు బోర్ వెల్ విడి భాగాలను మండల పరిషత్ కార్యాలయంలో భద్రపరిచారు.

ఆరు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లను అందజేస్తున్న షాలిని

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గొప్పిలి గ్రామానికి చెందిన తాళాసు షాలిని పాఠశాలకు ఆరు కంప్యూటర్లను సోమవారం వితరణగా అందించారు. కొన్నేళ్ల క్రితమే బెంగ ళూరులో స్థిరపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. విద్యలో విజయతీరాలకు చేర్చిన పాఠశాల రుణం తీర్చుకున్నారు. షాలినిని హెచ్ఎం రవికుమార్, గ్రామస్తులు అభినందించారు. షాలిని భర్త రమణ, సర్పంచ్ పల్లి యోగి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లి యోగి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



విజయలక్ష్మికి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: గులివిందలపేటకు చెందిన చింతాడ రమేష్ నెల రోజుల క్రితం హైదరాబాద్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందారు. మృతిని భార్య విజయలక్ష్మికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.4.90 లక్షల చెక్కును ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం పాతపట్నంలోని తన కార్యాలయంలో అందజేశారు. కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ గంధవరపు ఈశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేంద్ర, పేడాడ లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి గవర ఢిల్లేశ్వరరావు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సత్కారం



ఉపాధ్యాయుడు రమణను సన్మానిస్తున్న డిప్యూటీ ఈఓ పగడాలమ్మ

పాతపట్నం: రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బి.వి.రమణను టెక్కలి డిప్యూటీ ఈఓ జి.పగడాలమ్మ సోమవారం ఘనంగా సన్మానించారు. డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ బి.వి. రమణ.. 100 యూట్యూబ్ వీడియోలను (ఇంగ్లిష్ పాఠ్యాంశాలు) విద్యార్థులకు అర్థం అయ్యేలా తయారు చేయడం గొప్పవిషయమన్నారు. 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగపడేలా ఇంగ్లిష్ గ్రామర్‌తోపాటు పాఠ్యాంశాలు తయారు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు నల్ల కుమార్‌స్వామి, బి.సింహాచలం, సర్పంచ్ అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11 మద్యం సీసాలు స్వాధీనం

పాతపట్నం: మండలంలోని కొరసవాడ సమీపంలో ఎస్ఐ మహమ్మద్ యాసిన్ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. బోరుబద్ర గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కొరసవాడ నుంచి బోరుబద్ర వైపు ద్విచక్ర వాహనంపై 11 మద్యం బ్యాటిళ్లు తీసుకువస్తుండగా పోలీసులు పట్టుపబడ్డారు. బ్యాటిళ్లు స్వాధీనం చేసుకుని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మార్మోగిన రామ నామం



హిరమండలం: చొర్లంగి రామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



నరసన్నపేట: మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, భక్తులు



మెళియాపుట్టి: చాపరలో శ్రీరాముని విగ్రహం ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు

అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకుని అంతటా రామనామస్మరణ మార్మోగింది. కాషాయ జెండాలు, తోరణాలతో ఆలయ ప్రాంగణాలు, వీధులు మెరిశాయి. ఉదయం నుంచే మందిరాలకు భక్తజనం పోటెత్తి రాఘవునికి విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, హిందూ ధర్మ ప్రచార కమిటీలు, సంఘాల ఆధ్వర్యంలో బాలరాముని శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులు, సీతారాముల చిత్రపటాలను వీధుల్లో ఊరేగిస్తూ జైశ్రీరామ్ నినాదాలు చేశారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

– సాక్షి నెట్‌వర్క్



సారవకోట: హరిజన వీధిలోని రామ మందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బూర్జ: లక్ష్మీపురం శ్రీరామ మందిరం వద్ద అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



సరుబుజ్జిలి: రొట్టవలస రామాలయం వద్ద భజనలు చేస్తున్న భక్తులు



కొత్తూరు: మండల కేంద్రంలో శ్రీరాముని చిత్రపటంతో తిరువీధి నిర్వహిస్తున్న మహిళలు



జలుమూరు: శ్రీముఖలింగంలో దీపాలంకరణ చేస్తున్న భక్తులు



ఆమదాలవలస: పట్టణంలో సీతారామలక్ష్మణుడి వేషధారణల్లో భక్తులు



ఆమదాలవలస: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రామ భక్తులు



హిరమండలం: సుభలయలో తిరువీధి నిర్వహిస్తున్న రామ భక్తులు



నరసన్నపేట: గీతామందిరం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు



పొందూరు: గూనానపేట పాఠశాలలో విద్యార్థులతో బాలరాముడు వేషధారి



పాతపట్నం: మండల కేంద్రంలోని అష్టోత్తర నామార్చనల్లో పాల్గొన్న మహిళలు



కొత్తూరు: ఆకట్టుకున్న సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి వేషధారణలు



పాతపట్నం: మండల కేంద్రంలో హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



జలుమూరు: మండల కేంద్రంలో తిరువీధి నిర్వహిస్తున్న రామ భక్తులు

ప్రజాసంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



పొందూరు: తాడివలసలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

పొందూరు: ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. తాడివలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలు తెలుసుకున్నారు. అర్హత ఉండి ఇంకా సంక్షేమ పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. జగనన్న ప్రభుత్వం దేశానికే ఆదర్శమన్నారు. జగనన్నను మరోసారి సీఎంను చేయాలని కోరారు. ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, నాయకులు తమ్మినైన కృష్ణకుమారి, వాసు, పైడి పోలయ్య, గురుగుబెల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు..

నరసన్నపేట: అర్హతే ప్రామాణికంగా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కిళ్లాంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీల్లో 98 శాతం పూర్తి చేశారన్నారు. ఇటువంటి ప్రభుత్వం మళ్లీ, మళ్లీ అధికారంలో ఉంటే ప్రజలకు మేలు జరుగుతుందని స్పష్టంచేశారు. టీడీపీ, జనసేన నాయకుల అసత్య ప్రచారాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు తిప్పికొట్టాలన్నారు. గ్రామంలోని ప్రధాన రోడ్డు, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శిమ్మ నేతాజీ, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, ఎంపీటీసీ యాళ్ల అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, పార్టీ నాయకులు రాజాపు అప్పన్న, పుట్టా ఆదిలక్ష్మి, బొబ్బాది ఈశ్వరరావు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు యాగేటి కృష్ణ, బైరి నీలయ్య తండ్యాల వెంకటరమణ, ధర్మాన అప్పారావు, తంగి చంద్రశేఖరరావు, ధర్మాన జోగారావు డీలర్ యాగాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస రూరల్: దూసి ఆర్ఎస్‌లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్

పేదల జీవితాల్లో వెలుగులు..

ఆమదాలవలస రూరల్: పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థతో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. మండలంలో దూసి ఆర్ఎస్, నెల్లిమెట్ట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ చిగురుపల్లి దశరథ, పార్టీ నాయకులు తిర్లంగి శ్రీనివాసరావు, తమ్మినేని వేణు, పార్థసారధి, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఏపీఎం కూర్మారావు, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నలక్ష్మి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నరసన్నపేట: సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, తదితరులు

నరసన్నపేట: గ్రామాల్లో మౌలిక సదుపాయాలన కల్పనకు అన్న చర్యలూ తీసుకుంటున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పోతయ్యవలస కూడలి వద్ద (జాతీయ రహదారి) ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన బస్ షెల్టర్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ఈ షెడ్‌ను నిర్మించడం జరిగిందన్నారు. పోతయ్యవలస పంచాయతీలో పలు సమస్యలు ఇప్పటికే పరిష్కరించామన్నారు. పోతయ్యవలస సర్పంచ్ కనపల సత్యప్రియ, ఎంపీటీసీ సభ్యుడు గదిలి మల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కనపల అరవింద్ నాయుడు, అరవల సుధాకర్, పాగోటి గోవిందరావు, పాగోటి భరద్వాజ్, మడపాం సర్పంచ్ రాపర్తి ఎరుకోడు, ఎంపీటీసీ రువ్వ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



కామరాజు

జలుమూరు: మండల కేంద్రానికి చెందిన సిగబడి కామరాజు డిసెంబర్ 24 నుంచి కనిపించడంలేదని భార్య తేజోవతి స్థానిక పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. తన భర్త ఎప్పుడూ పనికి వెళ్లి సాయంత్రానికి ఇంటికి చేరుకునేవాడన్నారు. ఒక్కోసారి వారం, పది రోజుల తరువాత వచ్చేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పుడు కూడా తిరిగి వస్తాడనుకున్నామని, ఇంతవరకూ ఇంటికి చేరలేదన్నారు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. భార్య ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ధర్మరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నకోరాడలో వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

హిరమండలం: వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ఫరూక్ హుస్సేన్ అన్నారు. హిరమండలంలోని చిన్నకోరాడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో 104 సంచార వైద్య వాహన ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సోమవారం ఏర్పాటు చేశారు. చిన్నారులు, గర్భిణులకు వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విధుల్లోకి అంగన్‌వాడీలు

సారవకోట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గత నెల నుంచి ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లో చేరుతున్నారు. జలుమూరు, సారవకోట మండలాల్లోని మూడు సెక్టార్లలో ఉన్న కార్యకర్తలు, సహాయ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు విధుల్లోకి చేరుతున్నట్లు ధ్రువీకరణ పత్రాలను సీడీపీఓ కామాక్షికి సోమవారం అందజేశారు.



సీడీపీఓకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అంగన్‌వాడీలు

అనుమతులు తప్పనిసరి



ప్రైవేట్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ప్రసాదరావు

నరసన్నపేట: కొత్తగా ప్రారంభించే ప్రైవేట్ ల్యాబ్‌లు, నర్సింగ్ హోములు, స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు పొందాలని, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.ప్రసాదరావు అన్నారు. నరసన్నపేటలో రిజిస్ట్రేషన్ రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రైవేట్ ప్రయోగశాలలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా స్కానింగ్ సెంటర్లు, ప్రయోగశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటి ఏర్పాటులో ప్రభుత్వం నిర్దేశించిన అన్ని అనుమతులు పాటించాలని ఆదేశించారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్, హెల్త్ అసిస్టెంట్ పద్మరాజు ఉన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల



నరసన్నపేట: ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తున్న తహసీల్దార్ సింహాచలం

నరసన్నపేట: నియోజకవర్గంలో ఓటర్ల తుది జాబితా విడుదల చేశామని, 3504 మంది ఓటర్లు పెరిగారని నరసన్నపేట తహసీల్దార్ ఎ.సింహాచలం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం నియోజకవర్గానికి చెందిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించామన్నారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటికి 20,9429 మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం 21,2933 మందికి పెరిగారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్ల జాబితాను ప్రచురిస్తున్నట్లు తెలిపారు. బీఎల్‌ఓలు విధిగా ఆయా కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను కేంద్రాల్లో ప్రచురించాలని ఆదేశించారు. డీటీ శరత్, వీఆర్వోలు అప్పలనాయుడు, సూర్యానారాయణ, ఎన్నికల సిబ్బంది శ్రీను, మురళి తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలు ప్రదర్శించినట్లు తహసీల్దార్ ఎస్.రమణారావు తెలిపారు. డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి పేర్లు, ఫొటోలు మారినా సరిచేసుకోవడానికి చివరి అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బూర్జ: గుత్తావల్లిలో ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న బీఎల్‌ఓలు

కొత్తూరు: మండలంలోని 80 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు ఓటరు జాబితాలను ప్రచురించినట్లు తహసీల్దార్ డి.చక్రవర్తి తెలిపారు. మొత్తం 59,388 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పురుషులు 29,735 మంది, మహిళలు 29,652, ట్రాన్స్ జండర్ ఒకరు ఉన్నట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితాలపై అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు.